

అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

- మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలి

ప్రజాశక్తి -హుకుంపేట: స్త్రీశక్తి పథకం ద్వారా కేవలం ఐదు రకాల బస్సుల్లో కాకుండా ఆర్‌టిసి ఆధ్వర్యంలోని అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం (ఐద్వా అనుబంధం) జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, సప్తగిరి, సూపర్ డీలక్స్, అల్ట్రా డీలక్స్, అంతర రాష్ట్ర బస్సులు వంటి అన్ని రకాల బస్సు సర్వీసులకు ఉచిత ప్రయాణంవర్తింపజేయాలని కోరారు. అలాగే, ప్రతి పల్లెకు ఆర్‌టిసి బస్ సర్వీసులను నడపాలని, కొన్ని ప్రాంతాలకు గతంలో ఉండి రద్దయిన బస్ సర్వీసులను పునరుద్ధరించి, అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.



ఐద్వా జిల్లా కార్యదర్శి హైమావతి

మన్యంలో విస్తారంగా వర్షాలు

- పాడేరులో కుంభవృష్టి : జన జీవనానికి అంతరాయం
- జిల్లాలో 27.6 సగటుతో 608.2 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి మన్యంలో గురువారం భారీ వర్షం కురిసింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత దాదాపు రెండుగంటలపాటు కుంభవష్టిగా వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం పడడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు లేకపోవడంతో జనం కాస్త ఊపిరి పీల్చుకున్నారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది. పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.



పాడేరులో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

పంట పొలాల్లో మట్టి మేటలు

వరద ఉధృతితో కోతకు గురైన జాతీయ రహదారి కల్వర్టు



పంట పొలాల్లో మట్టి మేటలు

చింతపల్లి: భారీ వర్షాలకు చింతపల్లి మండలం అంతర్ల గ్రామంలో జాతీయ రహదారి 516ఈపై నిర్మించిన కల్వర్టు కోతకు గురైంది. మట్టితో పాటు కొట్టుకుంటూ వచ్చిన రాళ్లతో కూడిన వరదనీరు కల్వర్టు నిర్మాణ భాగాలను దెబ్బతీయడంతో కోతకు గురైంది. దీంతో దిగువనున్న పంటపొలాలను వరదనీరు ముంచెత్తడంతో అవి ముంపునకు గురికావడంతో పాటు మట్టిమేటలు వేసి పంటలు నాశనమయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి వరినాట్లు వేసిన రైతులంతా ఆదిలోనే పంట నష్టం జరగడంతో ఆవేదన చెందుతున్నారు. జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం, కల్వర్టు నిర్మాణంలో నాణ్యత లోపం, సమయానికి సంరక్షణ పనులు చేయకపోవడం వంటి కారణాలతో కల్వర్టు కోతకు గురై పంటలకు నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. పంటల నష్టాలకు తక్షణ పరిహారం ప్రకటించి, రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

పాడేరు: : అల్లూరి జిల్లాలోని 22 మండలాల్లో గురువారం వర్షపాతం నమోదయింది. ఓ మోస్తారు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా ఎటపాక మండలంలో 94.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.అల్లూరి జిల్లాలో సగటున 27.6 మిల్లీమీటర్ల వర్షంతో మొత్తంగా 608. 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలివి.

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో..)		
ఎటపాక	94.6	జి. మాడుగుల	21.4
కూనవరం	26.8	చింతపల్లి	18.2
చింతూరు	48.2	జీకే వీధి	1.4
వి ఆర్ పురం	32.4	కొయ్యూరు	46.2
ముంచంగిపుట్	12.4	మారేడుమిల్లి	19
పెదబయలు	4.2	దేవీపట్నం	28.4
డుంబ్రిగూడ	2.6	వై. రామవరం	30.8
అరకులోయ	9.4	అడ్డతీగల	48.8
అనంతగిరి	42.6	రాజ వొమ్మంగి	43.8
హుకుంపేట	10.8	గంగవరం	39.8
పాడేరు	12.8	రంపచోడవరం	13.6
		జిల్లా మొత్తం	608.2
		సగటు వర్షపాతం	27.6

బాలికల ఆశ్రమానికి వరద ముప్పు

చింతపల్లి: వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల ప్రభావంతో లంబసింగి-తాజంగి 516ఈ జాతీయ రహదారి పూర్తిగా జలమయమైంది. రహదారిపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల వాహన రాకపోకలు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. లంబసింగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీప ప్రాంతంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం, మడుగులు ఏర్పడటంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు మధ్యలో ఇరుక్కుపోయే పరిస్థితి ఉంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు ప్రాణభయంతో రాకపోకలు చేస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే పాఠశాలకు వరద ముప్పు తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విభాగం అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని, వర్షపు నీటిని వేరే మార్గంలో మళ్లించి, రహదారిపై ఉన్న నీటి ప్రవాహాన్ని అరికట్టాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



లంబసింగి, తాజంగి జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



చాపరాయి జలపాతం మూసివేత

ప్రజాశక్తి డుంబ్రిగుడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని గురువారం మూసేశారు. రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావారణ శాఖ హెచ్చరికలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురు, శుక్రవారాల్లో చాపరాయి జలపాత వద్దకు సందర్శకులును అనుమతించ బోమన్నారు. ఈ విషయాన్ని పర్యాటకులు గమనించాలని జలపాతం మేనేజర్ అప్పారావు తెలిపారు.

జెండా పండగకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం : ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ముస్తాబైన అతిథుల వేదిక

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు అంతాసిద్ధమైంది. పంద్రాగస్టు జిల్లాస్థాయి వేడుకల నిర్వహణకు జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల మైదానాన్ని ముస్తాబు చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పలు శాఖల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ప్రసంగిస్తారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, సహాయ కలెక్టర్ సాహిత్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, టిడబ్ల్యూ డిడి క్రాంతికుమార్, ఇతర ఉన్నతాధికారులు, ఏర్పాట్లను పర్యవేక్షించారు. మైదానంలో కవాతుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ముఖ్య అతిథులు ఆసీనులయ్యేందుకు వేదిక ప్రాంగణం సిద్ధం చేశారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. శకటాల రూపకల్పన..మరోవైపు సాయుధ బలగాల కవాతు.. ఇంకోవైపు విఐపీలు, వీక్షకులను దష్టిలో ఉంచుకొని మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా గ్రౌండ్ సిద్ధం చేశారు. నాలుగు రోజులుగా సాయుధ దళాల కవాతు సాధన చేశాయి. ఆహుతులను ఆకట్టుకునేలా, దేశభక్తి ఉట్టిపడేలా పాఠశాలల విద్యార్థులతో వివిధ రకాల దేశభక్తి గేయాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ పూర్తయ్యాయి. వేడుకల్లో విద్యార్థుల దేశభక్తి ప్రదర్శనలే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ౧. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో జరిగిన అభివద్ధి కార్యక్రమాలపై ప్రదర్శించే శకటాలు సిద్ధమయ్యాయి. మరోవైపు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించే విధంగా పలు స్టాళ్లను ఆకర్షనీయంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖలు అభివృద్ధిని వివరిస్తూ స్టాళ్ళలో చిత్రాలు, ఫ్లెక్సీలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇచ్చే ఆనవాయితీ యథావిధిగా కొనసాగనుంది. అవార్డులు అందించేందుకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, అధికారుల జాబితా సిద్ధమైంది.జిల్లా కేంద్రంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది. జిల్లా ఎఎస్ దినేష్ కుమార్, ఐటిడిఎ ఇంచార్జీ పిఒ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ఎంజె అభిషేక్ గౌడ ఆదేశాలతో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెసి అభిషేక్ గౌడ



సాంస్కృతిక ప్రదర్శనలో రిహార్సల్స్‌లో విద్యార్థినులు

భూస్వాముల చేతిలో కీలుబొమ్మ పాయం వెంకయ్య

గిరిజన ద్రోహిగా మారిన బిజెపి నాయకుని తీరుపై శ్రీరామగిరి ఆదివాసీలు మండిపాటు

ప్రజాశక్తి-విఆర్.పురం

స్థానికంగా లేని బడా భూస్వాముల కబంధహస్తాల్లో ఉన్న భూములను గిరిజనులమైన తాము భూ పోరాటం చేసి ఆక్రమించుకుంటే నీకెందుకు బాధ అని బిజెపి నాయకుడు పాయం వెంకయ్యను మండలంలోని శ్రీరామగిరి గ్రామ ఆదివాసీలు ప్రశ్నించారు. శ్రీరామగిరిలో గురువారం జరిగిన సమావేశంలో ఆ గ్రామానికి చెందిన ఆదివాసీలు ఆత్మకూరి కాంతారావు, పూసం రవివర్మ, పులి చంద్రావు, పులి ధర్మరాజు మాట్లాడుతూ బిజెపి నాయకుడు పాయం వెంకయ్య స్వార్థ లబ్ధి కోసం భూస్వాముల పక్షాన చేరి సొంత జాతికే ద్రోహం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వెంకయ్య అనేక పార్టీలు మారినా, ఆయన వక్రబుద్ధి మారలేదన్నారు. రాజకీయ స్వార్థ బుద్ధితో, స్వలాభం కోసం ఇంతమంది పేద గిరిజనులు చేస్తున్న భూ పోరాటాన్ని హేళన చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎన్నో మార్లు స్థానికంగా ఉన్న పేద గిరిజనులు భూస్వాములను ఎకరం రెండు ఎకరాలు కౌలుకు ఇవ్వమని అడిగినా ఏనాడు కూడా ఇవ్వలేదని, అప్పుడెందుకు వెంకయ్య మాట్లాడలేదని ప్రశ్నించారు.

పోలవరం భూ పరిహారం మొత్తం తీసుకొని ఈ ప్రాంతంలో లేకుండా భూమిని వదిలిపెట్టి వెళ్ళిపోయిన గిరిజనేతరుల భూములను మాత్రమే గిరిజన సంఘం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పేద గిరిజనులు ఆక్రమించుకోవడం జరిగిందని తెలిపారు.



నినాదాలు చేస్తున్న శ్రీరామగిరి గ్రామస్తులు

స్థానికంగా ఉన్న సోదర సమానులుగా భావించే గిరిజనేతరుల భూమిని ఒక్క సెంటు కూడా తాము ముట్టుకోలేదని, ముట్టుకున్న చరిత్ర కూడా తమకు లేదని పేర్కొన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే, కుట్ర బుద్ధితో తమ భూ పోరాటాన్ని అణచివేయాలని, గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందాలని చూడటం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. ఇక్కడ లేని భూస్వాముల భూములపై పోరాటం చేస్తే నీకెందుకు నొప్పి, గిరిజనేతర భూస్వాముల భూముల కోసం నీవు పడుతున్న తాపత్రయంలో ఆంతర్యం ఏమిటీ? అని పాయం వెంకయ్య తీరును ప్రశ్నించారు. గతంలో కూనవరం ప్రాంతంలో గిరిజనేతర ప్రజలకు నరకం చూపించిన పాయం వెంకయ్య తీరును ఎప్పటికీ వారు మర్చిపోరని, ఆయన ఎన్ని నాటకాలు ఆడినా గిరిజనేతర ప్రజల మనసును దోచుకోలేరని స్పష్టం చేశారు. గిరిజనేతరులపై ప్రేమ ఉంటే ఒకప్పుడు కొత్తగూడెం భూ పరిహారం విషయంలో సీతంపేట గ్రామస్తులను నెలల పాటు తిప్పి హైడ్రామా చేశావని, నేటి వరకు వారికి ఎందుకు న్యాయం చేయలేదో సమాధానం చెప్పగలవా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి గ్రామస్తులు వనం రామ్మూర్తి, మిడియం రాముడు, మడివి ఎర్రయ్య, మడివి శాంత, ఎం.సత్యనారాయణ, మడివి సత్తి, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలో రైతులకు సరిపడా ఎరువులు ప్రభుత్వం సరఫరా చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో 380 హెక్టార్లలో వరి, సుమారు 250 హెక్టార్లలో పత్తి పంట రైతులు వేశారని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో యూరియా అవసరానికి తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయలేదన్నారు. మరోపక్క దళారులకు యూరియా సరఫరా చేస్తుందని మండిపడ్డారు. ఎల్లవరం సచివాలయానికి 250 బస్తాలు, గొండోలు సచివాలయానికి 250 బస్తాలు సరఫరా చేసి చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయకపోవడంతో ఇదే అదునుగా దళారులు దొంగచాటుగా యూరియా తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప తగిన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా డివిజన్, జిల్లా స్థాయి అధికారులు స్పందించి సరిపడా ఎరువులు సరఫరా చేసి రైతులకు మేలు చేయాలని కోరారు.



రోడ్డును తవ్వి వదిలేయడంతో గుంతలు ఏర్పడిన దృశ్యం

తవ్వారు.. వదిలేశారు..

- మంచినీటి పైపులైన్ కోసం తవ్విన గోతులు పూర్తిగా పూడ్చని వైనం
- ప్రయాణానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం, గూడూరు పంచాయతీ పరిధి తూలుకొండ గ్రామంలో మంచి పైపులైన్లు వేయడానికి రోడ్డును తవ్వి దానిని పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. రెండు చోట్ల రోడ్డును అడ్డంగా రెండు అడుగుల మేరకు తవ్వి పైపులైన్లు వేసి ఆ కొద్దిగా మట్టి రాళ్లు వేసి పూర్తి స్థాయిలో పూడ్చకుండా వదిలేయడంతో అది పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. వర్షాలు కురవడంతో వాహన దారులు ఈ మార్గంలో ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు జారిపడిపోయే పరిస్థితి ఉంది. ఇంతకు ముందు ఇదే గ్రామంలో ఇలాంటి గోతుల వల్ల కింద పడి తీవ్రమైన గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి తవ్విన రోడ్డును పూర్తిస్థాయితో పూడ్చి గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోధకులు కోరుతున్నారు.

టీచర్‌ను సర్దుబాటు చేశాం

- ప్రజాశక్తి వార్తకు స్పందించిన ఎటిడబ్ల్యుఒ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చెరుకుమల్లు గ్రామం అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు వర్క్ ఎడ్జిస్ట్‌మెంట్‌లో భాగంగా ఉపాధ్యాయురాలిని సర్దుబాటు చేశామని జికె.వీధి ఎటిడబ్ల్యుఒ నాగ జయలక్ష్మి తెలిపారు. 'ఆ స్కూల్‌లో మాస్టారు లేరు' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురించిన వార్తకు ఎటిడబ్ల్యుఒ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని గతంలో సర్పంచ్ మురళి కమలమ్మ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విద్యాశాఖ అధికారులు వర్క్ అడ్జస్ట్మెంట్‌లో భాగంగా దారకొండ పంచాయతీ దబ్బకోటలో పాఠశాల ఉపాధ్యాయురాలు రత్నాబాయిని చెరుకుమల్లు పాఠశాలకు సర్దుబాటు చేసినట్లు చెప్పారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో గుమ్మిరేవుల రహదారి అధ్వానంగా ఉందని, దీంతో నర్సీపట్నం-గుమ్మిరేవుల బస్సు సర్వీసు నిలిపివేయడంతో ఆటోలు, ఇతర వాహనాలపై ఆలస్యంగా ఉపాధ్యాయురాలు పాఠశాలకు వెళ్లడం జరుగుతుందని ఎటిడబ్ల్యుఒ తెలిపారు.



చెరుకుమల్లు పాఠశాలకు హాజరైన ఉపాధ్యాయురాలు రత్నాబాయి



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

భారీ వర్షాలు కారణంగా మండలంలో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, ప్రభుత్వ ఉద్యోగులందరూ గ్రామ, మండల కేంద్రానికి అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదరులతో ఎంపిడిఒ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా సిబ్బంది చూడాలని సూచించారు. వాగులు, కాలవలు వర్షపు నీటితో పొర్లుతున్నయని, ప్రజలు, పర్యాటకులు అటువైపు వెళ్లకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలపై ఉందని స్పష్టం చేశారు. వర్షాలు కారణంగా మురుగునీరు నిల్వ లేకుండా డ్రెయిన్స్‌లో పూడిక తీయాలన్నారు. విద్యుత్ లైన్లు పడిపోయినా, చెట్లు పడిపోయినా కరెంట్ సరఫరాకు, రవాణాకు ఇబ్బంది లేకుండా సంబంధిత సిబ్బందితో మాట్లాడి సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, డిస్ట్రిక్ట్ టూరిజం అధికారి దాసు, టూరిజం అధికారులు నాయుడు, సాహితి, వైస్ ఎంపీపీ జి.రవికుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొత్తవలసలో ఆందోళన చేస్తున్న ఆశ్రమ విద్యార్థులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

కొత్తవలస పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని కొత్తవలస బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలోని దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాఠశాలలో సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ వసతి భవనం సరిపోవడం లేదని, శిథిలభవనం వర్షాలకు పూర్తిగా కారిపోతుందని, చాలీచాలని తరగతి గదులలో చదువుతున్నామని, మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపోవడం లేదని ఎస్ఎఫ్ఐ నేతల దృష్టికి విద్యార్థులు తెచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్. శ్రీను. జీవక్కృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో 460 మంది పైగా విద్యార్థులు చదువుతున్నప్పటికీ సరైన హాస్టల్ వసతి భవనం లేదని, పాడైన గదుల్లో వర్షాకాలంలో ఇబ్బందులతో నిద్రిస్తున్నారన్నారు. చాలీచాలని తరగతి గదులు, అరకొర మరుగుదొడ్లు, స్నానపు గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం అధికారులుపట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజన సదుపాయాలు కల్పించాలని, అప్పుడే విద్యార్థుల ఆరోగ్యం బాగుంటుందన్నారు. విద్యాసమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీడీవో. వెంకటరమణ, ఎంఈఓ బాలాజీ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు ఎం .రమేష్ .కె దినేష్, గీతాంజలి సామ్ రాజ్. బాబురావు. ఈశ్వరి. ప్రశాంతి. విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ వసతి సమస్యలపై ఆందోళన

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జోరువానలోనూ గురువారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. 2002-03 విద్యాసంవత్సరంలో కాలేజీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు కాలేజీ, హాస్టల్కు సొంత భవనం, మౌలిక సౌకర్యాల కొరతతో 300 మందికి పైగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2015-16లో అప్పటి ప్రభుత్వం హాస్టల్ భవనానికి నిధులు మంజూరు చేసినా పునాదులతో పనులు వదిలేశారన్నారు. దీంతో కొందరువిద్యార్థులు అద్దె భవనంలో ఉండి చదువుకుంటుండగా, మరికొంతమంది ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. హాస్టల్ వసతి, వంటషెడ్డు, ప్రహరీ, లైబ్రరీ, ప్రిన్సిపల్కు ప్రత్యేక గది, మరుగుదొడ్ల రన్నింగ్ వాటర్ కల్పించాలని కోరారు.

మట్టి గోడ కూలి బాలికకు తీవ్రగాయాలు

వైద్యసేవలకు వెళ్లేందుకు అవస్థలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని అంజలి శనివారం పంచాయతీ మారుమూల తాటిబంద గ్రామంలో మట్టిగోడ కూలి తీవ్రగాయాలైన గిరిజన బాలికకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి. డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పాత ఇంటి వద్ద తోటి పిల్లలతో సిందేరి లక్ష్మి (8) ఆడుకుంటుండగా, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తడిసి మెత్తబడిన మట్టి గోడ ఒక్కసారిగా కూలిపోయింది. కూలిన గోడ మట్టి, రాళ్ల మధ్యలో చిక్కుకున్న లక్ష్మి స్పృహ కోల్పోగా, ఆమె తండ్రి సిందేరి సత్తిబాబు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేని పరిస్థితుల్లో నాలుగు కిలోమీటర్లు దూరం జోరున వర్షంలోనే డోలీలో కుమార్తెను మోసుకొచ్చి, బుచ్చంత గ్రామం నుంచి ఆటోలో చౌనారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, అనంతరం విశాఖ కేజీహెచ్కు తరలించారు. ప్రస్తుతం కేజీహెచ్లో చికిత్స పొందుతున్న లక్ష్మికి ప్రభుత్వం అన్ని వైద్య ఖర్చులు భరించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని చిరంజీవి డిమాండ్ చేశారు. గోడ కూలి గాయపడిన లక్ష్మి కుటుంబానికి సాయంఅందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

అంబులెన్స్ రాదు.. డీజిల్ లేదట!

- అత్యవసర వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు : సిపిఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని సిహెచ్సికి 108 వాహనం, అంబులెన్స్ కేటాయించడంతోపాటు దాని నిర్వహణకు, అవసరమైన డీజిల్కు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని లక్ష్మీపురం సిపిఎం సర్పంచ్ కొర్రా త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు సొలగం గాసిరం దొర డిమాండ్ చేశారు. గురువారం సిహెచ్సిని సందర్శించి, అక్కడి రోగులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆకస్మిక తనిఖీకి వెళ్లి రోగుల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీపురం పంచాయతీ సంగంవలసకు చెందిన అల్లంగి.గురుమూర్తి ఆకస్మికంగా కాళ్లు చేతులు పనిచేయక అస్వస్థతకు గురికాగా, కుటుంబసభ్యులు ఉదయం 10 గంటలకు 108కు ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటల వరకు రాలేదన్నారు. దీంతో ప్రయివేటు ఆటోలో ఆసుపత్రికి తెచ్చారని, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తే అంబులెన్స్లో డీజిల్ లేదని సమకూర్చకపోవడం దారుణమన్నారు. మన్యంలోని పేద రోగులకు అవసరమైన వైద్యసదుపాయాలను సమకూర్చాల్సిన ఉండగా, అత్యవసరపరిస్థితుల్లో 108 వాహనం



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

అందుబాటులో లేకపోవడం, ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తే అంబులెన్స్లో డీజిల్ లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. లక్ష్మీపురం ఉప్ప సర్పంచ్ ఎ.సత్యం పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

- ఉత్పత్తి, వినియోగం నివారణకు ప్రణాళికలు

- జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్కుమార్

ప్రజాశక్తి -పాడేరు : సమాజానికి చేటు తెచ్చే గంజాయిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో ఈగల్, పోలీస్, వ్యవసాయశాఖ, అటవీశాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఐసిడిఎస్, ఎక్సైజ్, అటవీ శాఖ, డిఆర్డిఎ, సిపిఒ, డ్వామా, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై సమీక్షా సమావేశం నిర్వహంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తి, రవాణా, వినియోగంపై దృష్టి సారించాలని, అన్ని శాఖలు ప్రణాళికలు సిద్ధం చేసుకొని గంజాయి అనర్థాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహనా కల్పించాలన్నారు. డిగ్రీ,జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలో గంజాయి వినియోగంపై కలిగే నష్టాలపై కళాశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు .డిఎడిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చారని, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి, కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని స్పష్టం చేసారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ. గంజాయి, రవాణా చేసినా వారి స్థిర, చరాస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గంజాయి స్మగ్లర్లకు గిరిజన గ్రామాల్లో ఆశ్రయం కల్పించడం నేరమన్నారు. బస్టాండ్లలో పటిష్టమైన నిఘా పెట్టామన్నారు.. పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డిడికి పాఠశాలలు సందర్శించి విద్యార్థుల్లో మార్పులను గుర్తించి వారికీ అవగాహనా అందజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్, డిఎఫ్ఒ ప్లివి సందీప్ రెడ్డి, (వర్చువల్), జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీరామ్ పడాల్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి క్రాంతి, సిపిఒ పి.ప్రసాద్, ఎల్డిఎం మాతునాయుడు, ఈగల్ టీమ్ అనిల్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

ఆశావర్కర్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండలంలోని కించాయిపుట్టు గ్రామపంచాయతీ గడ్డిబంద, కించాయిపుట్టు గ్రామాలలో ఆశ వర్కర్ పోస్టులను భర్తీ చేయాలనీ ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను, మండల కమిటీ సభ్యులు కిల్లో నారాయణ డిమాండ్ చేశారు. గురువారం గడ్డి బంద గ్రామాన్ని సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ గడ్డిబంద గ్రామంలో ఆశ వర్కర్ చనిపోయి, నాలుగేళ్లుగా పోస్టు ఖాళీగా ఉన్న ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. గ్రామ ప్రజలు వైద్యసేవలకు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నా నిర్లక్ష్యం తగదన్నారు. గడ్డిబంద, కించాయి పుట్టు గ్రామాలలో ఖాళీగా ఉన్న ఆశ వర్కర్ పోస్టులు భర్తీ చేయాలని గ్రామసభల్లోనూ, జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్లో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. రెండు గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలితే చూసే దిక్కు లేదన్నారు ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఐటిడిఎ పిఒ స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.



నినదిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



పాడేరులో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులను ఆదుకోవాలి

పాడేరు, ముంచంగిపుట్టులో సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి- పాడేరు: కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో జీవనోపాధిని కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకుని న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం పాడేరు ఆర్టిసి కాంప్లెక్స్ రోడ్లో సిఐటియ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వలన రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మహిళా ప్రయాణికులకు ప్రయోజనం చేకూరడం హర్షనీయమన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఆటోలే జీవనోపాధిగా ఉన్న నిరుద్యోగులు ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవాలన్నారు. ఆటో రిక్షా కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించాలని, రుణ సబ్సిడీ, ఇంధన సబ్సిడీ, వాహన బీమా, రూ.ఐదు లక్షల వరకు వడ్డీలేని రుణం, ఏటా రూ.25వేలు జీవనభృతి వంటి సదుపాయాలను కల్పించాలని కోరారు ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. నిరసనలో ఆదివాసి ఆటో కార్మిక సంఘం యూనియన్ నాయకులు సంజీవరవు, సుందరరావు, వెంకటరావు, బాలు, సురేష్, కిరణ్, అనిల్, సాయి, దశు, నాగరాజు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: స్త్రీశక్తి పథకంలో జీవనోఎపాది కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆటో కార్మికులతో సమావేశం అనంతరం. మండల ఆటో కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పిస్తూ ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల నాయకులు ఎం కృష్ణ, ఎస్ సత్యం, ఎం రాజారావు, గిరిజన సంఘం నాయకులు ఎంఎ శ్రీను పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

ప్రజాశక్తి. -చింతపల్లి: మండలంలోని మారుమూల బలపం పంచాయతీ కోరుకొండ నుంచి ఏకవలసపల్లి వరకు వెళ్లే ప్రధాన రహదారి వర్షాకాలం ప్రారంభం నుంచే బురదమయమై, ప్రయాణం నరకయాతనగా మారింది. రోడ్డులో వర్షపు నీరు నిలిచి పెద్ద గుంతలు ఏర్పడటంతో రెండు చక్రాల వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు తరచూ ఇరుక్కుపోతున్నాయి. విద్యార్థులు, రోగులు, రైతులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా, వారు స్పందించకపోవడంతో, గ్రామస్తులే స్వచ్ఛందంగా శ్రమదానంతో రోడ్డు మరమ్మతులకు పూనుకున్నారు.. ట్రాక్టర్తో రాళ్లు తెప్పించి, రహదారిలో మోకాలి లోతుకు మించిన గోతుల్లో వేసి మరమ్మతు పనులు స్వయంగా చేపట్టారు. గ్రామంలోని యువత, వృద్ధులు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ గ్రామ రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టే పనుల్లో పాల్గొన్నారు. ఇన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైన తమ గ్రామ రహదారికి కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం లభిస్తుందని ఆశించినా అధికారులు కనీస చొరవ చూపకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం సరికాదని, ఇప్పటికైనా కోరుకొండ, ఏకవలసపల్లి రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేపట్టకుంటే ఆందోళన చేస్తామని వైసిపి నేత నీలకంఠం, ఏకవలసపల్లి హెచ్చరిస్తున్నారు.



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పలుచోట్ల హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర్రావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు జాతీయ జెండాలు చేత పెట్టి కళాశాల నుంచి స్థానిక మార్కెట్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో...

సీలేరులో గురువారం సిఆర్పిఎఫ్ డిఎస్పి అశోక్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలు పట్టుకుని సీలేరు పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామాలయం సెంటర్ మీదుగా సీలేరు పురవీధుల్లో తిరుగుతూ పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు దేశభక్తిని చాటుతూ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రత్న మాణిక్యం ఈ ర్యాలీని ప్రారంభించారు. కళాశాల ప్రాంగణం నుంచి చింతూరు మెయిన్ రోడ్ ఆర్టీసీ బస్టాండ్ వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, సీనియర్ అధ్యాపకులు జి.వెంకట్రావు, జి.హారతి, ఎస్.అప్పనమ్మ, కె.శకుంతల, కె.శైలజ, ఎం.నాగమోహన్రావు, ఆర్ మౌనిక, బి.శ్రీనివాసరావు, పి మౌనిక, ఎస్ ఆనంద్, ఎన్వివిఎస్ఎన్ మూర్తి, శీనయ్య, సుబ్బారావు, కన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతి చెందిన టీచర్ కుటుంబానికి యుటిఎఫ్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఇటీవల మృతి చెందిన రంప గిరిజన సంక్షేమ జిపిఎస్ పాఠశాల ఎస్జిటి ఉపాధ్యాయురాలు పల్లాల వెంకట సత్య సూర్య లక్ష్మీదేవి కుటుంబానికి యుటిఎఫ్ గురువారం ఆర్థిక సహాయం అందజేసింది. వెంకట సత్యసూర్య లక్ష్మీదేవి ఈ నెల 4న మృతి చెందగా, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం తరపున రూ.3 లక్షల చెక్ను నామిని రోలుపల్లి వెంకటేష్కు వారి స్వగ్రామం పనసలపాలెంలో అల్లూరి జిల్లా సంక్షేమ పథకం సహాధ్యక్షులు దూడ మహేష్, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, ఎంఇఒ శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శులు కె.సూరిబాబు, కె.ఆదిరెడ్డి, రంపచోడవరం మండల అధ్యక్షులు సిహెచ్.సనాతన్బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంగళరావు, ఎఫ్డబ్ల్యుఎస్ కార్యదర్శి పి.రాజు, కార్యదర్శులు డిపి.లింగన్న, డి.అనిల్బాబు, దేవీపట్నం, మారేడుమిల్లి, వై.రామవరం మండలాల ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కృష్ణాపురంలో బలవంతపు భూసేకరణ వద్దు

కలెక్టర్కు మొర పెట్టుకున్న రైతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామ రెవెన్యూలో తమ భూములను తమ అనుమతి లేకుండా ఎంఎస్ఎంఇ పార్కు కోసం చట్ట విరుద్ధంగా తీసుకుంటున్న చర్యలను విరమించి తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత రైతులు గురువారం సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు నాయకత్వంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమకు కృష్ణాపురం గ్రామ రెవెన్యూలో సర్వే నెంబరు 88, 93లో వ్యవసాయ భూములు ఉన్నాయని, అవి గత 50 ఏళ్లగా తమ స్వాధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఆ భూముల్లో టేకు, నీలగిరి, జీడిచెట్లు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. తామంతా దళితులం, బలహీన వర్గాలకు చెందినవారమని, పేద రైతులమని పేర్కొన్నారు. మొత్తం 60 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నామని, ఆ భూముల్లో 11 మందికి 11 ఎకరాల భూమి అసైన్డ్ హక్కులు కూడా కల్పించారని తెలిపారు. మొత్తం 66 ఎకరాలను ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయించినట్లు తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికొక ఎంఎస్ఎంఇ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, దీనిలో భాగంగా తమ కృష్ణాపురం గ్రామంలో తమ భూముల్లో ఈ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసిందని పేర్కొన్నారు. తమకు తెలియపర్చకుండా తమ భూముల్లో వున్నటువంటి టేకు, నీలగిరి, జీడి చెట్లను ప్రొక్లెయిన్లు, జెసిబిలు తీసుకొచ్చి ఎందుకు తొలగిస్తున్నారని ఇటీవల అడ్డుకున్నామన్నారు. తాత్కాలికంగా వెనక్కి వెళ్లారన్నారు. తమ



కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, గంగారావు

తాత, తండ్రుల నుండి ఈ భూములే ఆధారంగా జీవనం సాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎంఎస్ఎంఇ పార్కుకు అవసరమైన భూసేకరణకు గ్రామ తీర్మానం చేయలేదని, ప్రజాభిప్రాయ సేకరణ జరపలేదని తెలిపారు. తమ భూములుపై సర్వే కూడా చేయలేదని చెప్పారు. అన్ని చట్టాలనూ ఉల్లంఘించి భూములను దౌర్జన్యంగా తీసుకోవటానికి ప్రయత్నం చేయటం చట్ట వ్యతిరేకమన్నారు. ఒకవేళ ఎంఎస్ఎంఇ పార్కుకు భూములు అవసరమైతే తమ ఆమోదంతో భూసేకరణ చట్టం-2013 ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైతులు గాడు అప్పలనాయుడు, ఎన్.వెంకటరావు, ఎన్.రాంబాబు, ఎం.పైడినాయుడు, చిన్నా ఉన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న అన్నారు. గురువారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన సొంతమన్నారు. దేశంలో ఎన్నో సంస్కృతులు, సాంప్రదాయాలు, మరెన్నో కులాలు, మతాలు భాషలు ఉన్నప్పటికీ 75 సంవత్సరాలుగా మనల్ని ఐక్యంగా ఉంచి నడిపించింది మన రాజ్యాంగమేనన్నారు. నేడు మతోన్మాదులు ఆర్ఎస్ఎస్ రూపంలో భారత రాజ్యాంగాన్ని చిన్నాభిన్నం చేసే ప్రమాదం పొంచివుందన్నారు. ప్రజలందరూ సమానంగా, ఐక్యంగా ఉండడం ఇష్టంలేక రాజ్యాంగ పీఠికల నుండి సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని చూస్తున్నట్టు తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ బిజెపి విద్యను కాషాయీకరణ గావించిందని, చరిత్రను వక్రీకరించి స్వాతంత్ర్య పోరాటంలో వెన్ను చూపినవారిని దేశభక్తులుగా చిత్రీకరిస్తోందని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటిలోనూ ఆర్ఎస్ఎస్ వారితో నింపి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడితే మొట్టమొదట నష్టపోయేది దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మైనారిటీలేనని, కాబట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వైటి.దాస్, వై.రాజు, ఐసిఎస్.నాయుడు, నాయకులు సోమాదుల గణేష్, పార్థ సారథి, ఇమ్మాన్యూలు, సరోజినమ్మ, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎసిబి వలలో ఎస్ఐ ఈశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : లంచం తీసుకుంటుండగా అనకాపల్లి టౌన్ ఎస్ఐ దాసరి ఈశ్వరరావును రెడ్ హ్యాండెడ్గా అధికారులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని మీడియాకు ఎసిబి డిఎస్పి నాగేశ్వరరావు గురువారం వెల్లడించారు. అనకాపల్లి రఘురాం కాలనీలో ఎస్ఐ నివాసం ఉంటున్న ఇంట్లోనే ఎసిబి అధికారులు అతన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పెందుర్తికి చెందిన బంగారు వ్యాపారి ఎస్ఆర్జె.అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిఘా వేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఫిర్యాదుదారుడు అనకాపల్లిలో ఖాళీగా ఉన్న తన దుకాణాన్ని ఈ ఏడాది మేలో శ్రీ శాస్త్రి మండల్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చి, రూ.2 లక్షలను అడ్వాన్స్ తీసుకొని దుకాణం తాళాలను అతనికి అప్పగించాడు. జూలై 16న అద్దె దుకాణం నుంచి పక్కనే ఉన్న తన బంగారు దుకాణంలోకి అప్పారావు రంధ్రం తవ్వి బంగారు ఆభరణాలను దొంగిలించడానికి ప్రయత్నించాడని బుద్ధ శ్రీనివాసరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దొంగతనానికి ప్రయత్నించడంలో అతని ప్రమేయం ఉందని నిర్ధారించుకోవడానికి అతనిని ఎస్ఐ విస్తృతంగా విచారించసాగాడు. అతని దుకాణానికి తాళం వేసి తన వద్దనే ఉంచుకున్నాడు. రూ.2 లక్షల అడ్వాన్స్ మొత్తాన్ని కూడా తీసుకున్నాడు. తరచుగా పోలీస్ స్టేషన్కు పిలిపించి, చాలా గంటలు వేచి ఉండాలని బలవంతం చేశాడు. తర్వాత బంధువు, ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది ద్వారా సంప్రదించగా మొదట రూ.లక్ష లంచం డిమాండ్ చేసి తరువాత దానిని రూ.50 వేలుకు తగ్గించాడు. దొంగతనం కేసులో ఇరికించకుండా షాపు తెరిచేందుకు అనుమతి ఇచ్చేందుకు ఈ లంచం డిమాండ్ చేశాడు. బాధితుల నుంచి ఆ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించాడు. అతనిపై శాఖాపరమైన చర్యలకు నివేదిస్తామని ఎసిబి డిఎస్పి తెలిపారు.



నిలిచిపోయిన బస్సు

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - సీలేరు : పాడేరు డిపోకు చెందిన పాడేరు - డొంకరాయి బస్ సర్వీస్ సాంకేతిక లోపాలు తలెత్తి జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్లో ధర్మాపురం వద్ద గురువారం నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలకు గురయ్యారు. గురువారం తెల్లవారుజామున డొంకరాయిలో బయలుదేరిన బస్సు సీలేరు మీదుగా వెళ్తుండగా ధర్మాపురం వద్ద బస్సు ఆగిపోయింది. బస్సులో 44 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఉన్నతధికారులకు సమాచారం ఇవ్వగా, ప్రయాణికులను సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులో తరలించాలని సూచించారు. దీంతో ఈ ప్రయాణికులను చింతపల్లి చేర్చారు. ఘాట్ రోడ్డులో నడిపే బస్సులు కండిషన్ ఉన్నవి కాకపోవడంతో తరచూ మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు అరణ్యంలో అష్ట కష్టాలు పడుతున్నారు. కండిషన్ కలిగిన బస్సులు ఏజెన్సీ ప్రాంతంలో నడపాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కండిషన్ కలిగిన బస్సు సర్వీసులను ఈ ప్రాంతంలో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డొంకరాయిని మండల కేంద్రం చేయాలి

ప్రజాశక్తి- మోతుగూడెం : డొంకరాయి కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కరకా వెంకటరమణ మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యలయంలో బుధవారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును విన్నవించారు. గడిచిన 15 ఏళ్లుగా దీనిపై జరుగుతున్న పోరాటాన్ని, 147 రోజుల సుదీర్ఘ దీక్షలు చేస్తే ప్రభుత్వం డొంకరాయిని మండల కేంద్రం చేస్తామని ఇచ్చిన లిఖితపూర్వక హామీని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. 2016 నుండి 2025 వరకు వివిధ హోదాలలో ఉన్నా జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి ప్రజా నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యే శిరీష భాస్కర్ ఇలా ప్రజాప్రతినిధులు అందరూ డొంకరాయిని మండల కేంద్రం చేయాలని ఇచ్చిన లేఖలను అప్పటి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ప్రస్తుత అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఇచ్చిన లికితపూర్వక హామీ పత్రం ప్రతులను చూపించారు. డొంకరాయిని మండలం చేయడానికి, మండల స్థాయి అధికారులకు నివాసం ఉండటానికి ఉన్నటువంటి సదుపాయాలు గురించి తెలియజేశారు. ఈ సమస్యకు సంబంధించి వివిధ పత్రికల క్లిప్పింగ్స్ను ముఖ్యమంత్రికి అందజేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించి క్యాబినేట్ మంత్రుల కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు ఎంపిటిసి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిఒ 862 దారుణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగ జరపాలని జిఒ 862 తీసుకురావడం రాష్ట్ర ప్రజలను అవమానపరచడమేనని, ఇది రాజ్యాంగ విరుద్ధమని భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య అన్నారు. ఆ జిఒను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జివో 862 కాపీని చించి వేశారు.

సారంగ్ సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్ సారంగ్ను కాంప్లెక్స్ లైఫ్ ఎక్స్‌టెన్షన్ రిఫిట్ను పూర్తి చేసి గురువారం ఇండియన్ కోస్ట్ గార్డ్కు అప్పగించింది. హెచ్ఎస్ఎల్ 27 ఏళ్ల పాత వింటేజ్ నౌక అయిన సారంగ్ను షెడ్యూల్ కంటే మూడు రోజుల ముందుగానే సిద్ధం చేసింది.